
# అవసరం



వి. రాజారామమోహనరావు

**నా**లుగు రోజుల్నించీ ఆ గది కప్పు కూలిపోతుందేమో అనిపిస్తోంది నారాయణకి. నాలుగురోజుల్లో ఆ గది కప్పులో వచ్చిన మార్పేమీలేదు. దట్టంగా పట్టిన బూజుతోటి పనికిరాని సామానులతో నిండిన అటకతోటి... ఎండకి, గాలికి బాగా దారిచ్చి తమ కెందుకొచ్చిన గొడవలే అన్నట్టున్న పెంకుల్తోటి యిది వరకటిలాగే వుంది. వచ్చిన మార్పల్లా నారాయణలోనే...

వారం రోజులుగా జ్వరం. మొదటి మూడురోజులు జ్వరం ఎక్కువగా వుండటంవల్ల నీరసం అంతగా తెలియలేదు. నాలుగోనాడు జ్వరం తగ్గి బన్ రొట్టె తిన్నాక నీరసం తెలియటం మొదలైంది. యించుమించు ఆ రోజు సాయంత్రంనుంచే పిచ్చి పిచ్చి ఆలోచనలు రావటం మొదలెట్టాయి. నారాయణకీ తెలుసు ఆ యింటి కప్పు కూలిపోయే ప్రమాదమేం లేదని, యీ పిచ్చి ఆలోచనకి, అనుమానానికి కారణం అంతా తన నీరసమేనని.

చాలా సేపటినుంచి కదలకుండా అలాగే కూచోటంవల్ల నడుం లాగుతున్నట్టనిపించింది. నెమ్మదిగా కొంచెం కిందకి జరిగి, పక్కకి తిరిగి కిటికీలోంచి బైటకి చూస్తూ పడుకున్నాడు.

ఎండ దొడ్లో చెట్లకింద నేలతోటి దోబూచులాడుతోంది. గాలి మరీ అంత ఎక్కువగాలేదు. చెట్లమూలాన్న చల్లదనానికి లోటులేకుండా వుంది.

ఆ ఇంటివాళ్ళు అవుట్ హౌస్‌గా పిల్చుకునే ఆ గదిలో బతుకు మొదలెట్టిన

యీ యేడాదిలో నారాయణ చూపులకి రెండు చోట్లే బాగా అలవాటయ్యాయి. గదికప్పు... రెండోది ఎదురుగా కనపడే యింటివాళ్ళ మధ్యగది కిటికీ...

గది కప్పువేపు చూడాలంటే వొంట్లో నీరసం భయపెడుతోంది నారాయణని.

కొన్ని కొన్ని అయిష్టమైన పనులు ఒక్కోసారి అలవాటుగా మారిపోతాయి. యింటివాళ్ళ మధ్యగది కిటికీవేపు చూడటం నారాయణకి అలాంటి అలవాటే. ఆ కిటికీవేపు చూడకూడదని చాలాసార్లు అనుకున్నాడు. ఆ కిటికీవేపు చూసినప్పుడల్లా గతం కళ్ళముందు కదులుతుంది. చిన్నతనం గుర్తొస్తుంది. పుట్టింట్లోవున్న భార్య సరోజ గుర్తొస్తుంది. వీటన్నిటినుంచీ తప్పించుకోవాలని ప్రతిక్షణం అనుకుంటూనే వున్నాడు నారాయణ.

యింటికీ అవుట్ హౌస్‌కి మధ్య వందగజాలకన్నా ఎక్కువ దూరం వుండదు. ఆ యింట్లో కాస్త గట్టిగా, సందడిగా ఎవరేనా మాట్లాడుకుంటే గాలి వాలులో కొట్టుకొచ్చి ఆ మాటలు వినపడుతూనే వుంటాయి.

నారాయణ చూపులు అనుకోకుండానే కిటికీ చువ్వలు దాటాయి. యింటివాళ్ళ పెద్దమ్మాయి మంచంమీద బోర్లా పడుకునుంది. అతను తలవేపు కూచున్నాడు. నవ్వుతోన్నట్టుంది...వీపంతా ఎగిరిపడుతోంది. అతనూ నవ్వుతున్నాడు. ఆమె ఎగిరిపడే వీపు... అందమైన మెడకింది వంపు ఎండ తెరలోంచి మసక మసగ్గా కనపడ్డాయి నారాయణకి.

'సరోజకూడా అందమైందే...' అనుకున్నాడు నారాయణ భార్య గుర్తు రావటంతో. పెళ్ళయిన కొత్తలో...కొత్త కాపరం పెట్టిన మొదటి నెలలో చాలా సార్లు, చాలా సందర్భాలలో అనుకున్నాడు నారాయణ యిలా. సరోజ నారాయణ గురించి మనసులో ఏమనుకుందో నారాయణకి తెలిసే అవకాశం రాలేదు. ఆడవాళ్ళు భర్తగురించి ఏమనుకుంటారో అంత తేలిగ్గా అర్థమయ్యే అదృష్టం చాలామంది మగవాళ్ళకుండదు.

సరోజక్కూడా తనంటే యిష్టమనే అనుకున్నాడు నారాయణ. పెళ్ళికోసం ఉభయపక్షాలవాళ్ళు చేసిన అప్పు తాలూకు డబ్బు కొంత మిగిలివుండటం వల్ల మొదటి రెండుమూడు నెలలు కొత్త కాపరం సరదాగానే గడిచింది. అప్పుడు పాలకొల్లు పంచదార ఫేక్టరీలో పని చేస్తుండేవాడు నారాయణ. సీజన్ వున్నప్పుడే వుద్యోగం వుండేది. అప్పుడు సీజన్ రోజులవటంవల్ల జీతం కూడా వచ్చేది. కొత్త సరదాల్తోటి, కొత్త కోపాల్తోటి, చిన్న చిన్న యిబ్బందుల్తోటి మొదటి యేడాదంతా బాగానే గడిపారు నారాయణా, సరోజ.

ఆ యేడాదిలో సరోజ మనస్తత్వం కొంతవరకు అర్థమైంది నారాయణకి. సరోజకి సరదా లెక్కువ. నారాయణకీ సరదాలుండేవి... కానీ అవి తీరకపోతే పెద్దగా బాధపడేవాడు కాదు... సర్దుకుపోయేవాడు. కానీ సరోజ అలా కాదు. వాటిని అస్తమానం గుర్తుతెచ్చుకుని ఎదురింటి వాళ్ళతోనో పక్కింటి వాళ్ళతోనో పోలిక తెచ్చుకుని బాధపడుతూండేది. అనుకోకుండా లాటరీ వచ్చేసి మధ్యతరగతి సంసారం స్వర్గమైపోవటం లేకపోతే ఓ పేదపిల్లని అకస్మాత్తుగా ఏ లక్షాధికారో ప్రేమించి పెళ్ళిచేసుకోటం లాంటి సినిమా అభిరుచుల్తోటి ఎదిగింది సరోజ. మనసు, వాటితోపాటు మనసులోని సరదాల్ని ఏదోరకంగా తీర్చుకోవాలన్న పట్టుదలకూడ వుండేది.

ఎవరి ప్రాపకంతోనో షుగర్ ఫాక్టరీలో వుద్యోగం పెరమనెంట్ అవుతుందనుకున్న నారాయణకి నిరాశే మిగిలింది.

నేను బియ్యే పాసయ్యానని చాలా మందికి అప్లికేషన్లద్వారా చెప్పి చెప్పి విసిగిపోయాడు నారాయణ. చివరికి మరో దారిలేక ఓ బట్టలకొట్లో గుమాస్తాగా చేరాడు. చాలారోజులు అదే గొప్ప అదృష్టమని సరిపెట్టుకోబోయాడు. సరోజకి నచ్చచెప్పబోయాడు. నారాయణ మాటలన్నీ సరోజ విందే తప్ప ఏం మాట్లాడలేదు.

నారాయణ యింట్లో లేనంతసేపూ ఎవర్నెవర్నో అడిగి ఏవేవో పుస్తకాలు తెచ్చి కాలక్షేపం చేసేది. నారాయణ రాత్రి ఎప్పుడో పదింటికి వచ్చేవాడు. పెద్దగా మాటలేం వుండేవికావు. భోజనాలయ్యాక కాస్సేపు మెళకువుగా వుంటే వుండేవారు... లేకపోతే లేదు. రెండో యేడు గడిచేలోపల అర్థమైంది నారాయణకి తమిద్దరి మధ్యా ఎంతదూరం పెరిగిందో... కానీ చెయ్యగలిగిందేమీ కనిపించలేదు. ఒక్కోసారి, ఎలాగేనా సరోజకి నచ్చచెప్పి జీవితంలో యిదివరకటి సంతోషమంతా తెచ్చుకోవాలనుకునేవాడు... ఏదో రాత్రి లేని ఓపిక తెచ్చుకుని పెద్ద లెక్చర్లా చెప్పేవాడు. సరోజ అన్నీ వినేది... ఏం మాట్లాడేది కాదు.

ఆ యేడాది నారాయణకి ఏదేదో వంకచెప్పి రెండుసార్లు పుట్టింటికెళ్ళి రెండు నెలలుండి వచ్చింది సరోజ... తర్వాత నెల తిరక్కుండానే మళ్ళీ ఏదో వంకపెట్టి బయలుదేరింది. ఆ తర్వాత నారాయణే రెండుసార్లు వెళ్ళివచ్చాడు. యింట్లో మరేం చెప్పిందో రెండోసారి వెళ్ళినప్పుడు మావగారు నెమ్మదిగా అన్నాడు నారాయణతో...

"అక్కడ యింట్లో యిబ్బంది ఎక్కువగా వుందని అమ్మాయి అంటోంది. నీకేం అభ్యంతరం లేకపోతే కొంచెం గట్టి వుద్యోగం దొరికేవరకు

అమ్మాయిని యిక్కడే వుంచితే నీకూ వీలుగా వుంటుందని నా వుద్దేశం...'' అని...

నారాయణ మరేం మాట్లాడలేదు... సమయం చూసి సరోజని అడిగాడు "వస్తావా..." అని

సరోజ వస్తానని అనలేదు... రాననీ అనలేదు.

ఇంక తను వొత్తిడి చెయ్యటం అనవసరం అనుకుని నారాయణ ఒక్కడే తిరిగి వచ్చేశాడు.


బియ్యే పాసైన తనకి సరైన వుద్యోగం దొరక్కపోటంకన్నా, చాలీ చాలని జీతంతో గుమాస్తాగా బతకుతున్న దానికన్నా, అసలు తనకి పెళ్ళెందుకు జరిగిందా అని బాధపడ్డాడు నారాయణ ఆ రోజు.

ఇంట్లో ఒంటరిగా వుండబుద్ధేసేది కాదు. సరోజ పూర్తిగా పుట్టింటిలో వుండిపోలేదు. బెజవాడ దగ్గరే కాబట్టి అప్పుడప్పుడు వచ్చి ఓ వారం పది రోజులు వుండి వెళ్ళిపోయేది. సరోజ తిరిగొచ్చిన మొదటి ఒకటి రెండుసార్లు ఆశపడ్డాడు నారాయణ. కానీ అవి మేరేజ్ లైసెన్సుని రెన్యూ చేసుకోటానికి వచ్చే రాకపోకలని తెలుసుకోటానికి ఎన్నాళ్ళో పట్టలేదు.

మొదట కొన్నాళ్ళు బాధపడ్డాడు... తర్వాత కొన్నాళ్ళు తన చేతకాని తనానికి సిగ్గుపడ్డాడు. చివరికి అక్కడ వుండలేక హైద్రాబాదు వచ్చేశాడు.

కొత్తలో అన్నింటికన్నా ఎక్కువగా ఒంటరితనం బాధించింది నారాయణని. ఊరు కొత్త, వాతావరణం కొత్త... పరిచయస్తులెవరూ లేకపోవటం... బాగా దెబ్బతిన్న మనసు.

ఆదివారం వస్తోందంటే యిబ్బందిగా వుండేది. మిగిలిన రోజుల్లో అయితే కొట్లోనే కాలక్షేపం అయిపోయేది. యిప్పుడుంటున్న యింటివాళ్ళదే కొట్టు.



నారాయణ చదువుకునే రోజులనాటి ఓ స్నేహితుడికి యీ యింటివాళ్ళ పెద్దబ్బాయి స్నేహితుడు. ఆ రకంగా యీ ఉద్యోగం దొరికింది. ఉద్యోగంతోపాటు అవుట్ హౌస్‌లో వుండమని కూడా చెప్పారు. హోటల్‌లో తినే అవకాశం లేదు కాబట్టి వంట మొదలెట్టాడు. వండుకోటం...తింటం...ఎప్పుడేనా ఓసినిమా చూట్టం...అప్పుడు భార్య గుర్తొస్తే మరిచిపోటానికి నానా యాతన పట్టం ...యిలా నడుస్తోంది నారాయణ జీవితం.

ఓ రోజు మిగిలిన అన్నం పారెయ్యటానికి బయటికొస్తే ఎక్కణ్ణించో పరిగెత్తుకొచ్చింది. తెల్లగా...బొద్దుగా వుంది.. నారాయణే పేరు పెట్టాడు ఆ కుక్కపిల్లకి... రెండుపూట్లా మిగిలిన అన్నం వేసేవాడు. వంట అంత అనుభవం లేకపోవటంవల్ల అడుగంటిన అన్నమో, మిగిలిన అన్నమో ప్రతిపూటా వుంటూనే



వుండేది. ముందు నారాయణ గది గుమ్మందగ్గరే పడుకునేది. చలికాలం రావటం చూసి నారాయణే దాని పడకని తన మంచంకిందకి మార్చాడు.నారాయణ చాలావరకు తన ఒంటరితనాన్ని ఆ కుక్కపిల్లద్వారా మరిచిపోయే ప్రయత్నం చేశాడు.

నడుం మళ్ళీ లాగటం మొదలెడితే మరోసారి సద్దుకు కూచున్నాడు నారాయణ.

యింటివాళ్ళమ్మాయి కిటికీవేపు తిరిగి పడుకుని అతని ముఖంలోకి చూస్తూ ఏదో మాట్లాడుతోంది.

'అన్ని కబుర్లేంవుంటాయో చెప్పుకోటానికి...' అనుకున్నాడు నారాయణ. తనతో ఎక్కువగా మాట్లాడకుండా చెప్పినవన్నీ వినే సరోజముఖం గుర్తొచ్చింది. ఈ మధ్య భార్య గుర్తొచ్చినప్పుడల్లా అసహనంగా వుంటోంది నారాయణకి. ఆ అసహనం భార్య తలపుమీదే కాదు. చుట్టుపక్కల వాళ్ళమీద, పరిసరాలమీద, జీవితంమీద... ఆ సమయంలో ఏదైనా చిరాగ్గానే వుంటోంది నారాయణకి.

ఏంమాటలు దొర్లాయోకానీ యింటివాళ్ళమ్మాయి లేచి కూచుని కడుపు పట్టుకుని మరీ నవ్వుతోంది. భుజంపట్టుకుని ఆ నవ్వుని ఆపే ప్రయత్నం చేస్తున్నాడతను. నెమ్మదిగా కిటికీమీంచి చూపు తిప్పుకున్నాడు నారాయణ.

వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కారు. అతను వాళ్ళకి బంధువో స్నేహితుడో కానీ యించుమించు ప్రతిరోజు వస్తాడు. వెడితే యిద్దరూ కలిసి బైటికెడతారు. లేకపోతే అలాగే కలిసి కూచుని గడిపేస్తారు. వాళ్ళిద్దరూ డల్‌గా వుండగా ఏనాడూ నారాయణ చూళ్ళేదు.

ఇంటివాళ్ళ అల్లుడు అమెరికా వెళ్ళి మూడేళ్ళయిందట. వీళ్ళిద్దరికీ సంబంధం వుందని చాలామంది అనుకోగా నారాయణా విన్నాడు. అది తప్పా వొప్పా అన్న విషయంమీదకి నారాయణ దృష్టి ఏనాడూ పోలేదు కానీ, ఆ అమ్మాయి భర్త తిరిగొచ్చాక ఏం జరుగుతుందా అని ఒకటి రెండుసార్లు ఆలోచించాడు. ఆ యింటివాళ్ళ మనస్థత్వాన్ని బట్టి వూహిస్తే భర్తరాగానే యితన్ని చాలా తేలిగ్గా దూరం చేస్తుందనిపించింది నారాయణకి.

ఒంట్లో నీరసం మరింత పెరిగినట్టనిపించింది నారాయణకి. కాస్సేపు కళ్ళు మూసుకున్నాడు. లేచి కాసిని మంచినీళ్లు తాగితే బాగుణ్ణనుకున్నాడు... కిటికీలో పెట్టుకున్న గ్లాసులోనీళ్లు అయిపోయాయి. పొద్దున్నకూడా అంతే... నీళ్ళయిపోతే చాలాకష్టంమీద తూలుతున్న వొంటితో వెళ్ళి దొడ్లోంచి తెచ్చుకున్నాడు. ఇంటివాళ్ళు యించుమించు అందరూ చూశారు నారాయణ అలా తూలుతూ నీళ్ళు తెచ్చుకోటం... ఎవరూ పట్టించుకున్నట్టు కనపళ్ళేదు... అయినా వాళ్ళకేం అవసరం అనుకున్నాడు.

ఆ అమ్మాయి అంతే. ఎదురుగా తను చూస్తున్నాడని తెలిసీ చాలా కేర్‌లెస్‌గా వుంటుంది. అత నున్నప్పుడేనా కిటికీ మూయదు, కనీసం తెరకూడ వేయదు.

లేద్దామని ప్రయత్నించాడు నారాయణ... వొళ్ళు అంతగా సహకరించక అలాగే కూచుండిపోయాడు. అప్రయత్నంగా మళ్ళీ కిటికీవేపు చూశాడు... చాలా దగ్గరగా యించుమించు అతని గుండెలకి తల తాకేఅంత దగ్గరగా పడుకుని ఏదో చెపుతోంది.

గొంతుక ఎండుకుపోతున్న ట్టనిపించింది నారాయణకి... 'ఎవరేనా వచ్చి కాసిని మంచినీళ్ళిస్తే ఎంత బావుణ్ణు...' అనుకున్నాడు.

ఎవరేనా అన్న భావన సరోజని గుర్తుకు తెచ్చింది. గుర్తువచ్చిన వెంటనే కొరడాతో కొట్టినట్టు వులిక్కిపడ్డాడు నారాయణ ...కళ్ళు ఒక్కసారిగా బైర్లు కమ్మినట్టనిపించాయి... 'యిక్కడ యీ యింటివాళ్ళమ్మాయిలాగే ... అక్కడ సరోజకూడా ఎవరితోనేనా...' అనిపించింది నారాయణకి.

"ఛీ.. ఛీ.. వెధవ ఆలోచన— వెధవ నీరసం—" అనుకున్నాడు.

అలా ఆలోచిస్తుంటే.. చీరలు.. సినిమాలలాంటి సరోజ చిన్న చిన్న సరదాలు గుర్తొచ్చాయి.. అవి తీర్చలేని తన ఆర్థిక పరిస్థితి.. అవి తీర్చుకోటంలో సరోజకున్న పట్టుదలా గుర్తొచ్చాయి.. మళ్ళీ

మరోసారి చెడుతలపు నారాయణని భయపెట్టింది.

తను మరీ యింత బెంబేలు పడిపోకూడదనుకున్నాడు. ధైర్యంగా వుండాలనుకున్నాడు. తనకెవరూ సాయంలేరు.. ఒంటరిగాణ్ణి అనుకోటమే యీ నీరసానికి యీ పిచ్చిపిచ్చి ఆలోచనలకి కారణం అనుకున్నాడు.


అలా అనుకోటంతో కోపంవచ్చింది నారాయణకి.. ఏమిటో ఎవరిమీదో తెలియని కోపం.. ఆ తర్వాత మరి కాస్సేపటికి కొద్దిగా కళ్ళు తడిసాయి నారాయణకి.

రోజుకి పదమూడుగంటలు వాళ్ళ కొట్లో గొడ్డులా పనిచేస్తున్నానే.. కళ్ళ ముందు నీరసించి కనపడుతున్నానే.. కనీసం వొక్కసారి పలకరిస్తే వీళ్ళ సొమ్మేంపోతుందో అనుకున్నాడు యింటి వాళ్ళగురించి చివరికి.

ఎప్పుడొచ్చిందో నారాయణ చూణ్ణే లేదు. దొడ్లో చింతచెట్టుకింద పడుకున్న తెల్లకుక్క నెమ్మదిగా లేచి నారాయణ గదిగుమ్మందాకా వచ్చింది.

గుమ్మందాకా వచ్చిన దాన్నిచూసి అలవాటుగా 'ఛీ.. ఛీ..' అని తరిమెయ్యబోయాడు. అది యిదివరకటిలా తెల్లగా బొద్దుగా లేదు. వొళ్ళంతా ఎర్రటి మచ్చలుపడి, చాలా చోట్ల జుత్తంతా వూడిపోయి బక్కచిక్కి వుంది. దానికి గజ్జి పట్టిందగ్గర్నించి గదిలోకి రానివ్వకుండా జాగ్రత్తపడ్డాడు నారాయణ.

గొంతుదాకా వచ్చిన స్వరం గొంతులోనే వుండిపోయింది నారాయణకి.




నారాయణ పెట్టిన పేరు.. యిదివరకటి ఆ పియిపు వినపడుతుందేమో అన్నట్టు గుమ్మందగ్గరే నిలబడి జాలిగా చూస్తోందది.

'అవును తనెందుకు దాన్ని దగ్గర చేరనివ్వటంలేదు. దాని ఆరోగ్యం చెడింది.. అందం పోయింది.. దాని చేరువ తనకి యిదివరకటిలా ఆనందంగా వుండటంలేదు.. అందుకేనా..' అనిపించింది నారాయణకి.

'అంటే.. జీవితం పూర్తిగా అవసరాలతో ముడిపడిపోయింది.. యింటి వాళ్ళకి అల్లుడి అవసరం.. అల్లుడికి అమెరికా డిగ్రీ అవసరం.. ఆ అమ్మాయికి, అతనికి మరో అవసరం.. అలాగే సరోజ.. అలాగే తనూనా..

తన పరిస్థితికి కారణం కంటికి కనపడేది సరైన వుద్యోగం లేకపోవటం.. వుద్యోగం దొరక్కపోటానికి కారణం.. సరోజ మనసు అలా తయారవటానికి కారణం.. అనుబంధాలు కేవలం అవసరాలు తీర్చుకోటానికే అన్నట్టు మారటానికి కారణం.. వేరే ఏదో వుందనిపించింది నారాయణకి..

'ఫెలో ఫీలింగ్ పూర్తిగా చచ్చిపోతోంది.. చచ్చిపోతుంది' అని గొణుక్కున్నాడు నారాయణ అలా ఆలోచిస్తూ.

మరి కాస్సేపటికి ఎండ చెట్లకింద నుంచి బయటకొచ్చేశాక నెమ్మదిగా ఓపిక కూడదీసుకుని లేచాడు నారాయణ.

'పోటీ పడతాను.. అవసరాలతో పోటీ పడతా..' అనుకున్నాడు. అలా అనుకుంటుండగానే సరోజ గుర్తొచ్చింది. ఇదివరకటిలా చిరాకు కలగలేదు నారాయణకీసారి.

నారాయణ కిసరకపోటం చూసి... ఒకటి రెండుసార్లు అటూ యిటూ తలతిప్పి నెమ్మదిగా తెల్లకుక్క గదిగుమ్మం దాటి లోపలికి వొచ్చింది.

